క్లుప్తంగా

డయేరియా 8 మందికే


డాక్టర్ ప్రియాంక

పూతలపట్టు: మండలంలోని చిన్నబండపల్లెలో 8 మందికి మాత్రమే డయేరియా ఉన్నట్లు స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ ప్రియాంక తెలిపారు. ఆమె శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ఎక్కువ సంఖ్యలో డయేరియా సోకినట్లు వస్తున్న వార్తలన్నీ నిజం కాదని తెలిపారు. చిన్నబండపల్లి గ్రామంలో 8 మందికి మాత్రమే డయేరియా సోకిందని పేర్కొన్నారు. ఈ వర్షాకాలంలో ప్రజలు గోరువెచ్చని నీటిని తాగాలని సూచించారు. నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను తినకూడదని తెలిపారు. ఇంటి వద్ద నిల్వ ఉన్న నీటిని వీలైనంత త్వరగా తొలగించాలని తెలిపారు. జ్వరం, విరేచనాలు, వాంతులు వంటి లక్షణాలు ఉన్నప్పుడే వెంటనే స్థానిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించాలని తెలిపారు. ఇప్పటికే డయేరియా కేసులు నమోదైన చిన్నబండపల్లి గ్రామంలో వ్యాధి తగ్గుముఖం పడుతోందని పేర్కొన్నారు. గ్రామంలో శనివారం వరకు మెడికల్ క్యాంపు కొనసాగుతుందని ఆమె వివరించారు. ఆమెతో పాటు సీహెచ్‌ఓ శ్రీనివాసమూర్తి ఉన్నారు.

జిరాక్స్ ప్రతులను అందజేయాలి

బంగారుపాళెం: మండలంలోని చంద్రశేఖరపురం సహకార సంఘంలో సభ్యత్వం కలిగిన రైతులు పొలానికి సంబంధించిన జిరాక్స్ ప్రతులను అందజేయాలని సీఈఓ రామ్మూర్తి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సహకార సంఘాల కంప్యూటరీకరణలో భాగంగా సభ్యులుగా ఉన్న రైతులు పాస్‌బుక్, ఆధార్, పాన్‌కార్డుతో పాటు 2 పాస్‌పోర్టుసైజు ఫొటోలు కార్యాలయంలో అందజేయాలన్నారు. లేని పక్షంలో సభ్యత్వాన్ని రద్దుచేయనున్నట్లు తెలిపారు.

మహిళా సంఘాలకు విరివిగా రుణాలు


మాట్లాడుతున్న ఏపీఎం సుధారాణి

గుడిపాల: మండల సమాఖ్య ద్వారా విరివిగా రుణాలను మహిళా సంఘ సభ్యులకు అందజేయనున్నట్లు ఏపీఎం సుధారాణి అన్నారు. వెలుగు కార్యాలయంలో శుక్రవారం సంఘమిత్రలకు సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండల సమాఖ్య నిధి నుంచి బయోమెట్రిక్ ద్వారా ప్రతి మహిళా సభ్యురాలికి రుణాలు ఇవ్వనున్నట్లు వివరించారు. మహిళా సభ్యురాలికి బ్యాంకుతోపాటు స్త్రీనిధి, మండల సమాఖ్య ద్వారా విరివిగా రుణాలను అందించాలని సంఘమిత్రలకు ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో వెలుగు సీసీలు హేమచంద్రారెడ్డి, లోకనాథరెడ్డి, మల్లీశ్వరి పాల్గొన్నారు.

కాణిపాకంలో తగ్గిన రద్దీ

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానానికి భక్తుల రద్దీ తగ్గింది. వేసవి సెలవులు ముగియడంతో భక్తుల సంఖ్య తగ్గుముఖం పట్టింది. శుక్రవారం 21,386 మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. భక్తుల తాకిడి అధికంగా లేకపోవడంతో భక్తులు స్వామిని సులభంగా దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరం రాములుగుడి వీధిలోని జైన్‌సంఘ మందిరంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సుభాష్‌జైన్ తెలిపారు. ఉదయం7 నుంచి 10 గంటల వరకు శిబిరం ఉంటుందన్నారు. అరవింద్ హాస్పిటల్ వైద్యులు కంటి పరీక్షలు చేసి, ఎంపికైనా వారికి ఉచితంగా ఆపరేషన్ చేస్తారని ఆయన పేర్కొన్నారు.

రాసనపల్లెలో వైద్యసేవలు


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ అనూష

గుడిపాల: మండలంలోని రాసనపల్లెలో శుక్రవారం ఫ్యామిలో డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ అనూష 60 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. గర్భవతులు, బీపీ, మధుమేహ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి తగు సూచనలు ఇచ్చారు. అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. గర్భవతులు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. వైద్యసిబ్బంది శిరీష, దివ్య, మల్లిక, సుధ, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

వారపు సంత వేలం పాట

గంగాధర నెల్లూరు: గ్రామ పంచాయతీకి చెందిన వారపు సంతను జీడీ నెల్లూరు మండల వైస్ ఎంపీపీ హరిబాబు వేలం పాటలో కైవసం చేసుకున్నారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంపాటలో రూ.3,79,500కు వైస్ ఎంపీపీ హరిబాబు వారపు సంతను పాడుకున్నారు.

సరైన పోషణతోనే పశు సంరక్షణ


పశువులను పరిశీలిస్తున్న వైద్యాధికారులు


షెడ్డులో ఉన్న పశువులు

- మేత విషయంలో జాగ్రత్తలు అవసరం
- రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కాణిపాకం: వ్యవసాయంతో పాటు పశుపోషణ గ్రామాల్లో ప్రధాన వృత్తిగా ఉంటుంది. పాడి రైతులు తమ పశువులను సొంత బిడ్డల్లా చూసుకుంటూ ఉంటారు. ప్రస్తుతం సీజన్ మారుతోంది. వర్షాలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో పశువులు జబ్బుల బారిన పడకుండా ఉండాలంటే రైతులు పలు జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా వాటికి పోషకాహారం అందజేయాలి. అప్పుడు పశు సంపద వృద్ధి చెందుతుంది. పశువులకు తగిన మోతాదులో మాంసకృత్తులు, పిండి, కొవ్వు పదార్థాలు, విటమిన్లు, నీరు అవసరమని పశుసంవర్ధక శాఖాధికారులు సూచిస్తున్నారు.

రోగనిరోధక శక్తికి..

పశువుల ఎదుగుదలకు, రోగనిరోధకశక్తికి మాంసకృత్తులు ఎంతో అవసరం. పడ్డలు, పెయ్యల ఎదుగుదలకు, పాడి పశువుల్లో పాల దిగుబడికి దోహద పడతాయి. ఇవి ఆహారంలో లోపిస్తే పశువులు చిక్కిపోవడం, ఎదుగుదల స్తంభించడం, అండాశయం చిన్నగా ఉండడం, ఆలస్యంగా ఎదకు రావడం, వ్యాధి నిరోధక శక్తి తగ్గడం, కండరాల బలహీనత వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. పత్తి గింజలు, కొబ్బరి పిండి, వేరుశనగ పిండి, నువ్వుల పిండి, చేపల పొడి వంటి పప్పు జాతికి చెందిన పశు గ్రాసాల్లో సమృద్ధిగా లభిస్తాయి.

దెబ్బల నుంచి రక్షణ

పశువుల శరీరంలో కొవ్వు నిల్వలు అంతర్గత అవయవాలను దెబ్బల నుంచి కాపాడతాయి. శరీర ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరిస్తాయి. ఆహారంలో రుచిని పెంపొందిస్తాయి. పశువుల సక్రమ పునరుత్పత్తిలో మాంసకృత్తుల కంటే కొవ్వు అందించే శక్తి ముఖ్యమైంది. కొవ్వు, పిండి పదార్థాల కన్నా రెండున్నరెట్లు అధిక శక్తినిస్తాయి. ఒక గ్రాము కొవ్వు పదార్థం సుమారు 9 కిలోల క్యాలరీల ఉష్ణశక్తిని అందిస్తుంది. వేరుశనగ పిండి, కొబ్బరి పిండి, నూనె గింజల చెక్క, గోధుమ తవుడు, వరి తవుడులో కొవ్వు పదార్థాలు ఎక్కువగా ఉంటాయి.

చిత్తూరు డివిజన్‌లో పశుసంపద వివరాలు		
రకం		సంఖ్య
ఆవులు	-	4,67,507
గేదెలు	-	1,036
గొర్రెలు	-	4,38,362
మేకలు	-	1,38,463

నీరు అత్యంత అవసరం

పశువులు నీరు లేకుండా ఐదు రోజులకు మించి బతకలేవు. నీరు శరర జీవన ప్రక్రియ ఉత్పాదకతకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఆహారంలోని వివిధ పోషక పదార్థాలను సంగ్రహించడానికి, పోషకపదార్థాలు, విటమిన్లు, ఖనిజ లవణాలు శరీరంలోని వివిధ భాగాలకు చేర్చడానికి, శరీర ఉష్ణోగ్రతను క్రమ బద్ధీకరించడానికి, శ్వాస ప్రక్రియ కొనసాగడానికి, శరీర ద్రవాల పీచు సాధారణ స్థాయిలో ఉండేందుకు, చర్మం సాగే గుణం కలిగి ఉండడానికి జీర్ణక్రియలో ఉపయోగపడే కొన్ని ఎంజైముల తయారీకి, వ్యర్థ పదార్థాల విసర్జన క్రియకు నీరు దోహదపడుతుంది. శరీరంలోని మాంసకృత్తులు, కొవ్వు పదార్థాలు, పిండి పదార్థాల ఆక్సిడేషన్ వల్ల కూడా అర లీటరు నుంచి లీటరు వరకు నీరు ప్రతి పోషక పదార్థం తరపున లభ్యమవుతుంది. శరీరంలో నీరు తక్కువైతే చర్మం పొడిగా మారడం, మూత్ర సంబంధ వ్యాధులు, అజీర్తి, మలబద్ధకం తదితర సమస్యలు ఉత్పన్నమవుతాయి. మలిన పదార్థాలు విసర్జింపబడకుంటే పశువుల డీహైడ్రేషన్‌ను గురవుతాయి. పశువుకు రోజుకు 50 నుంచి 60 లీటర్ల నీరు అవసరం.

జాగ్రత్తలు అవసరం..



వర్షాకాలంలో గొర్రెలు, మేకల పెంపకం దారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. లేకపోతే చిటిక, నీలి నాలుక, పారుడు, కాళ్ల డెక్కల, శ్వాసకోశ వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. గొర్రెలు, మేకలను వర్షం బారి నుంచి రక్షించడం కోసం పాకలు ఏర్పాటు చేయాలి. అప్పుడే వాటిని న్యూమోనియా వ్యాధి సోకకుండా కాపాడుకోవచ్చు. వ్యాధి సోకిన వాటిని సులువుగా జీర్ణమయ్యే ఆహారం ఇవ్వాలి. వ్యాధులు సోకిన గొర్రెలు, మేకలను మందలో కలపకూడదు. ఒక వేళ గొర్రె , మేక మృతి చెందితే దానిని ఊరికి దూరంగా తీసుకెళ్లి లోతుగా గొయ్యి తవ్వి పూడ్చి పెట్టాలి. మూగజీవాలకు ఏ వ్యాధి సోకినా వెంటనే దగ్గరలోని పశువైద్యశాలకు తీసుకెళ్లి వైద్యం చేయించడంతో పాటు అక్కడి పశువైద్యాధికారి సలహాలు, సూచనలు పాటించాలి.

–ప్రభాకర్, జేడీ, పశుసంవర్ధక శాఖ, చిత్తూరు

మట్టి తరలింపుపై ఫిర్యాదు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు మండలం చెర్లోపల్లి పంచాయతీ బాపనచెరువు నుంచి మట్టి తరలిస్తున్నారని శుక్రవారం గ్రామస్తులు ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. జేసీబీలతో ఇష్టారాజ్యంగా మట్టితోడేస్తున్నారని తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఎలా మట్టి తరలిస్తారని ప్రశ్నించారు. దీనిపై ఇరిగేషన్ అధికారులు స్పందిస్తూ, పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. పట్టుబడితే కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు.

ఈఈగా బభ్రువాహన


బభ్రువాహన

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు ట్రాన్స్‌కో అర్బన్ ఈఈగా బభ్రువాహన నియమితులయ్యారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు డివిజన్ ఈఈగా ఉన్న ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ప్రస్తుతం ఇన్‌చార్జి ఈఈగా ఉన్న పీలేరు ఈఈ మునిచంద్ర ఆయనకు బాధ్యతలను అప్పగించారు. అయితే ఆదివారం బభ్రువాహన ఉద్యోగ విరమణ చేయనున్నారు. రెండు రోజుల్లో విరమణ పొందనున్న ఈఈకి ఆయన బాధ్యతలు ఇవ్వడంపై ఉద్యోగులు ఆశ్చర్యపోతున్నారు. అయితే ఆ తర్వాత ఇన్‌చార్జిగా ఈఈ మునిచంద్ర కొనసాగాలని ఉత్తర్వుల్లో వివరించారు.

వరసిద్ధునికి రూ.4లక్షల ఆదాయం

కాణిపాకం: కాణిపాకంలోని స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానానికి శుక్రవారం రూ.4 లక్షలకు పైగా ఆదాయం చేకూరింది. దర్శన టికెట్ల విక్రయం ద్వారా 3,98,750, అన్నదాన ట్రస్టుకు రూ.43,088, గోసంరక్షణ ట్రస్టుకు రూ.700 భక్తులు విరాళ రూపంలో సమర్పించారు. వీరికి అలయ అధికారులు ప్రత్యేక దర్శన భాగ్యం కల్పించారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పుష్పపల్లకిపై కోదండరాముడి చిద్విలాసం

- అధిక సంఖ్యలో హాజరైన భక్తులు
- భక్తిప్రపత్తులతో స్వామికి ఊంజల్‌సేవ
- నేడు కల్పవృక్ష వాహన సేవ


భక్తజన సందోహం మధ్య పుష్పపల్లకిపై ఊరేగుతున్న కోదండరామ స్వామి

తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరు కోదండ రాముల దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి పుష్పపల్లకి సేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయంలో వేదపండితులచే ఉదయం సీతారామలక్ష్మణులు, ఆంజనేయ స్వామికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించి ధూపదీపనైవేద్యం సమర్పించారు. అనంతరం ఉభయదారులు మోహన్‌రెడ్డి కుటుంబసభ్యులచే స్వామికి తిరుమంజనం, జయరామిరెడ్డి కుటుంబసభ్యుల నేతృత్వంలో స్వామికి పాలాభిషేకం చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

–భక్తిప్రపత్తులతో స్వామికి ఊంజల్‌సేవ

కోదండరామాలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం స్వామికి ఊంజల్‌సేవను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. స్వామికి పూజాసామగ్రి, సుగంధపరిమళ పుష్పాలు, గజమాలలు, వివిధ రకాల ప్రసాదాలు, ఫలాలను మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. వేదపండితులచే వేదమంత్రాలు చదువుతూ స్వామికి అభిషేకం, సుగంధపరిమళ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి, పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. దీనికి ఉభయకర్తలుగా వెంకటపతినాయుడు వ్యవహరించారు.

వైభవంగా పుష్పపల్లకి సేవ

రాత్రి పుష్పపల్లకి సేవను అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామికి పూజాసామగ్రి, ప్రసాదాలు, పండ్లు, సుగంధపరిమళ పుష్పాలు, గజమాలలను మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. వేదపండితులు ఉత్సవ మూర్తులు సీతారామలక్ష్మణులు, ఆంజనేయ స్వామికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, వేదమంత్ర పఠనంతో ధూపదీప నైవేద్య కైంకర్యాలను సమర్పించారు. సుగంధ పరిమళ పుష్పాలు, విద్యుద్దీపాలంకరణతో మెరుస్తున్న పుష్పపల్లకిలో కొలువైన శ్రీరామచంద్రమూర్తి మేళతాళాలు, డప్పు వాయిద్యాలతో పురవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. భక్తులు ఇంటింటా కొబ్బరికాయలు కొట్టి, కర్పూర, మంగళహారతులిచ్చి స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఉభయదారులుగా టి.పుత్తూరు యూత్ వ్యవహరించారు.

నేడు కల్పవృక్ష వాహన సేవ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా తిరుమంజనం, పాలాభిషేకం, సాయంత్రం స్వామికి ఊంజల్‌సేవ, రాత్రి కల్పవృక్ష వాహన సేవను వైభవంగా నిర్వహిస్తామని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పి.సిద్ధేశ్వర రెడ్డి, కార్యనిర్వాహకులు తెలిపారు.




స్వామికి ఊంజల్‌సేవ నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు, పుష్పపల్లకిలో కొలువైన సీతారామలక్ష్మణులు, ప్రత్యేక అలంకరణలో పుష్పపల్లకి

పండుఈగ బుట్టలతో మామిడికి రక్షణ


పండుఈగ బుట్టలను పరిశీలిస్తున్న ఉద్యానవన శాఖ అధికారి సాగరిక

బంగారుపాళెం: మామిడి తోటల్లో పండుఈగ బుట్టలతో పంటను కాపాడుకోవాలని ఉద్యానశాఖ అధికారి సాగరిక సూచించారు. మండలంలోని మామిడితోటలను శుక్రవారం ఆమె పరిశీలించారు. మామిడితోటల్లో నీలం రకం మామిడి కాయలను ప్రస్తుతం పండుఈగ వల్ల నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. పంట నష్టం జరగకుండా మామిడి తోటల్లో రైతులు పండుఈగ బుట్టలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ ఏడాది అంతంత మాత్రమే పంట వచ్చిందన్నారు. వచ్చిన పంటను పండుఈగ నుంచి కాపాడుకోవాలన్నారు. ఎకరాకు 6 నుంచి 8 పండు ఈగ బుట్టలను పెట్టుకోవాలని సూచించారు. బుట్టలోని చెక్కముక్కపై ఏదైనా పురుగుమందును 4 నుంచి 5 చుక్కలు వేయాలన్నారు. బుట్టలను భూమి నుంచి 3 నుంచి 4 అడుగుల ఎత్తులో కట్టుకోవాలని చెప్పారు.

కంప్యూటర్ ఆపరేటర్లను నియమించండి


ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గురజాల

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని ఆరు మునిసిపల్ హై స్కూళ్లలో కంప్యూటర్ ఆపరేటర్లను నియమించాలని మునిసిపల్ టీచర్లు, ఎమ్మెల్యేను కోరారు. ఈ మేరకు చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ నాయుడిని శుక్రవారం మునిసిపల్ ఉపాధ్యాయులు కలిశారు. పాఠశాలల్లో కంప్యూటర్ ఆపరేటర్లు లేకపోవడం వల్ల ఆ ఒత్తిడి టీచర్లపై పడుతోందన్నారు. కస్తూర్బా, వరదప్పనాయుడు పాఠశాలల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని మునిసిపల్ కమిషనర్‌ను, ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు జయప్రకాష్‌నాయుడు, తులసీరామ్, పరంధామ, నీరజాక్షులు పాల్గొన్నారు.

1న పింఛన్ పంపిణీ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్

పూతలపట్టు: లబ్ధిదారులకు జూలై1వ తేదీన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాలని అధికారులను ఎమ్మెల్యే మురళీమోహన్ ఆదేశించారు. మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన శుక్రవారం నియోజకవర్గ స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వచ్చే నెల ఒకటో తేదీన సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు కలిసి లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ అందజేస్తారని తెలిపారు. నియోజకవర్గానికి మాత్రమే రూ.31 కోట్ల పింఛన్ ద్వారా లబ్ధిదారులకు అందజేస్తున్నట్లు తెలిపారు. స్థానిక ఎంపీడీఓ ప్రసన్నకుమారి, తహసీల్దార్ సుబ్రమణ్యం రెడ్డి పాల్గొన్నారు.

చిత్తడి కాలం.. పాములతో భద్రం!

- పొలాల్లో పొంచి ఉన్న ప్రమాదాలు
- ఏమరుపాటుగా ఉంటే ప్రాణాలకే ముప్పు
- వ్యవసాయ పనుల్లో జాగ్రత్తలు తీసుకోవాలి
- స్థానిక ఆస్పత్రిలో అందుబాటులో మందులు



గుడిపాల: వర్షాకాలంలో పాములు ఎక్కువగా కనిపిస్తుంటాయి. ముఖ్యంగా అటవీ ప్రాంతంలోని సరిహద్దు గ్రామాల్లో, దట్టమైన పొదల సమీపంలో సంచరిస్తుండడం సాధారణమే. అయితే ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా పాముకాటుకు గురయ్యే ప్రమాదం ఉంది. కొన్నిరోజుల కిందట చిత్తపారలో గొర్రెలను మేపుతుండగా ఓ వృద్ధుడు పాము కాటుకు గురై చనిపోయాడు. నంద్రకప్ప, తేలు కాటుకు గురై పలువురు ఆస్పత్రుల్లో చికిత్సలు పొందుతున్నారు. ఏటా జూలై నుంచి సెప్టెంబర్ వరకు పాములు, ఇతర విష కీటకాలు బెడద అధికంగా ఉంటుంది. పొలాల్లో పచ్చి కలుపు పెరగడంతో ఎక్కడ ఏ విషపురుగు ఉందో గుర్తు పట్టడం కష్టం ఉంటుంది. అయితే రైతులు ఈ విషయంలో కాస్త అప్రమత్తంగా ఉండాలి. కొన్ని జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలను అధిగమించవచ్చని వైద్యులు చెబుతున్నారు.

నిర్లక్ష్యం తగదు

ప్రస్తుతం విషపూరిత జీవులు పంట పొలాల్లో సంచరిస్తూ ఉంటాయి. ముఖ్యంగా పాములు ఎలుకలను, కప్పలను తినేందుకు బయట తిరుగుతూ, చెట్ల పొదల్లో దాగుంటాయి. అలాంటి సమయంలో అప్రమత్తంగా ఉండాలి. ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు నిర్లక్ష్యం వహించకూడదు. ముఖ్యంగా పాము కాటేస్తే ఒంటిపై రెండు లేదా నాలుగు కామా (,) ఆకారపు గుర్తులు పడతాయి. అరగంటలోపు విషం ఒళ్లంతా పాకి నాడి వ్యవస్థపై ప్రభావం చూపిస్తుంది. కళ్లు మూతలు పడడం, చేతులు, కాళ్లకు తాత్కాలికంగా పక్షవాతం రావడం, మాట ఆగిపోవడం, నాలుకకు రుచి తెలియకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. రక్తపింజర కరిచిన భాగం ఉబ్బి తీవ్రంగా నొప్పి కలిగిస్తుంది. అరగంటలో నోట్లోంచి, చెవుల్లోంచి రక్తస్రావం అవుతుంది.

పాముకాటేస్తే ఇలా చేయాలి

పాముకాటుకు గురైన వారు ఎలాంటి ఆందోళన చెందకూడదు. తీవ్రమైన ఒత్తిడికి గురైతే గుండెపోటు వచ్చే ప్రమాదం ఉంది. పాము కాటువేసిన భాగాన్ని ఎక్కువగా కదిలించరాదు. ఆ భాగాన్ని బట్టతో లేదా టవల్‌తో గట్టిగా కట్టాలి. ఇలా చేయడం వల్ల విషం శరీరంలోకి వ్యాపించదు. కట్టును పది నిమిషాలకు ఒకసారి వదులు చేసి, మళ్లీ బిగించాలి. పాముకాటు వేసిన చోట కొత్త బ్లేడుతో ప్లస్ (+) గుర్తు మాదిరి ఒక సెంటిమీటర్ లోపలి వరకు కోయాలి. కాసేపటికి విషంతో కూడిన రక్తం దానంతట అదే బయటకు పోతుంది. సాధ్యమైనంత తొందరగా సమీపంలోని ఆస్పత్రికి తీసుకువెళితే విషానికి విరుగుడుగా యాంటీ వీనమ్ తీసుకుంటే ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చు. అన్ని ప్రాథమిక ఆస్పత్రుల్లో మందులు అందుబాటులో ఉన్నాయని వైద్యులు తెలిపారు. రాత్రి వేళ పొలం వద్దకు వెళ్లే రైతులు శబ్దం చేస్తూ వెళ్లాలి. దాంతోపాటు టార్చ్‌లైట్ వెంట తీసుకెళ్లడం మంచిది.

అన్ని పాములూ ప్రమాదకరం కాదు

మనకు కనిపించే అన్ని పాములు విషపూరితం కాదని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. నాగుపాము, కట్లపాము, రక్తపింజర వంటి పాముల వల్లే ప్రమాదం ఉందని చెబుతున్నారు. సాధారణంగా 50శాతానికి పైగా పాముల వల్ల ఎలాంటి ప్రమాదం ఉండదని చెబుతున్నారు. పాము కాటేసిన వెంటనే వైద్యం చేయించుకుంటే ఎలాంటి సమస్య ఉండదు.

విషపూరిత పాములు

రక్తపింజర ఎక్కువ అటవీ ప్రాంతంలో ఉంటుంది. ఈ పాము కాటువేస్తే 2 గంటల తరువాత విషం శరీరానికి ఎక్కుతుందని వైద్యులు చెబుతున్నారు. రక్తపింజర కాటువేసిన వెంటనే అందుబాటులో ఉన్న ప్రాథమిక ఆస్పత్రులకు వెళ్లి వైద్యం పొందాలి.

నాగుపాము: అత్యంత ప్రమాదకరమైంది. ఈ పాము కాటువేస్తే 15 నిమిషాల్లో విషం ఎక్కుతుందని చెబుతున్నారు. ముందుగా పాముకాటు వేసిన చోట వెంటనే కట్టు కట్టాలి. తదుపరి పాముకాటుకు గురైన వ్యక్తిని ఆస్పత్రికి తరలించాలి. నాగుపాము విషం ప్రధానంగా నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

కట్లపాము: కాటు వేసిన వెంటనే విషం రక్తంలో కలుస్తుంది. ప్రాణాపాయం ఎక్కువ. పాము కాటు వేసిన వెంటనే ఆస్పత్రిలో చేర్పించి వైద్యం చేయించాలి. కట్లపాము విషం రక్తంలోకి చేరకముందే వైద్యం చేయిస్తే ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశం ఉంది.

అప్రమత్తంగా ఉండాలి



పాము నుంచి రక్షించుకొనేందుకు అప్రమత్తంగా ఉండాలి. పాముకాటుకు గురైతే యాంటీ వీనమ్ మందులు అన్ని ప్రాథమిక కేంద్రాల్లో అందుబాటులో ఉంటాయి. కాటుకు గురైన వ్యక్తి శరీరంలో మార్పులు రాకుండా తగు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది.

– సంధ్య, వైద్యాధికారి, పీహెచ్‌సీ, గుడిపాల

గర్భిణులు ప్రతి నెలా పరీక్షలు చేయించుకోవాలి


కట్టకిందపల్లెలో గర్భిణికి బీపీ పరీక్షలు చేస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్

తవణంపల్లె: గర్భిణులు ప్రతి నెలా పరీక్షలు చేయించుకొని ఆరోగ్యం గురించి తెలుసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని కట్టకిందపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ వినయ్‌కుమార్ గర్భవతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మంచి పౌష్టికాహారం, తాజా కూరగాయలు, ఆకుకూరలు తీసుకోవాలని సూచించారు. క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలన్నారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు పాటించాలని వివరించారు. అనంతరం వైద్య శిబిరంలో రోగులకు పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. వృద్ధులు, బాలింతలు, గర్భిణులు, బీపీ, షుగర్ వాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి మందులు అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రాజామణి, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.